

# రంగులు

సింగరాజు రామచంద్రమూర్తి

వీ్రరాజు టైము చూసుకున్నాడు.

"పదహారు సార్లు చూస్తే అయిదు నిమిషాలు గడిచింది ఈ లెక్కన" అనుకుని గభాలున లేచి పక్కన తలవంచుకుని పనిచేస్తున్న తుకారాం దగ్గరకు వెళ్ళి "ఏరా - తుకారాం, పదహారు సార్లు చూస్తే ఒక్క అయిదు నిమిషాలు గడిచింది. ఈ రకంగా నేనెన్ని సార్లు చూడాలంటావు ?" అనడిగాడు.

తుకారాం తలెత్తి "ఒక్క సారి" అన్నాడు.

వీ్రరాజు ఫక్కున నవ్వేశాడు. ఎలాగో ?"

"తలవంచుకుని పని చేసుకుంటూ కూర్చుంటే సరి."

"బోడి సలహా. చిట్టీ, అటువంటి దురభిప్రాయాలు మానేసి అగ్గిపెట్టిలా ఇడేయ్."

"ఇందాకెప్పుడో పట్టుకెళ్ళావు."

"సర్లె. పట్టేసుకో... నాయనా జనమేజయా, నీ అగ్గిపెట్టె పడేస్తావు?"

అగ్గిపెట్టె పుచ్చుకుని బయటకుపోతూ "నమస్కారం గురువుగారూ, వస్తారేమిటి ఒక అ-వేద్దాం" అన్నాడు ఒక గురువుగార్ని తట్టి.

ఇతని కోసమే ఎదురు చూస్తున్నట్లుగా అతనూ లేచి "ఈ రోజుకి పని పూర్తి చేశావేమిటిరా ?" అన్నాడు.

"దాని దేముంది గురూ, సాయంం చేయమంటే మన తుకారాం చేయడూ బాకీ తీరుస్తానంటే సరి."

మరొక అయిదు నిమిషాలుందనగా హడావుడిగా లోపలికి వచ్చేసి టేబుల్ సర్దుకునేంతలో బెల్ మోగడం జరిగి పోయింది.

"నా అగ్గిపెట్టె ఇవ్వు వీ్రరాజూ" అని ఒకరు "నాదికూడా" అని మరొకరు "నా లైటురు" అని ఇంకొకరూ అంటూ చుట్టూ చేరిన నలుగురైదుగురికి సమాధానంగా జేబుల్లోంచి, డ్రాయరు సొరుగు లోంచి గబగబ తీసి అన్నీ బల్ల మీద పోశాడు.

"ఏరుకోండోయ్, అవతల నాకు పెద్ద పనుంది - రారా తుకారాం" అని బయటికి నడిచాడు వీ్రరాడు.

నేరుగా హొటలులోకి వెళ్ళి కూర్చున్నారు.

"నమస్కారం సార్, పెసరట్, మినపట్, రవ్వట్ ... రవ్వట్, మినపట్, పెసరట్" అన్నాడు సర్వరు-వీ్రరాజును చూస్తూనే ఉత్సాహం పుంజుకుని.

"మొదటి వరసలో మొదటిది, రెండవ దానిలో చివరిది-రెండు రోస్ట్" అన్నాడు అంతకన్నా ఉత్సాహంగా వీ్రరాజు.

భాష తెలిసిన పెంపుడు జంతువులా లోపలికి వెళ్ళిపోయాడు సర్వరు అసలు వీ్రరాజు చెప్పక పోయినా అతను తెచ్చేది పెసరట్టే!

"ఏవిటిరా తుకారాం విశేషాలు, ఏం లేవుకదూ! నాకు ఏం లేవులే" అంటూనే హొటలులోకి ప్రవేశిస్తున్న ఒకరిని

చూసి 'హలో, నమస్కారం సార్, బావున్నారా' అన్నాడు.

ఆ 'సారు' వీర్రాజువంక ఒక్కక్షణం చూసి అంతలోనే తెప్పరిల్లి 'ఆఁ, ఆఁ మీ దయవలన' అన్నాడు.

'బొత్తిగా తమ దర్శనాలు కరువయి పోయాయండి.'

'ఏదీ పని ఒత్తిడి – వస్తామరి' అంటూనే హడావుడిగా ఆయనవీర్రాజుకి దూరంగా ఒకబల్ల చూసుకుని వెళ్లి పోయాడు.

'నీకీజబ్బు ఇంకెన్నాళ్ళురా వీర్రాజూ' అడిగాడు తుకారాం.

'సర్లేగానొరేయ్, ఇప్పుడీ బిల్లు మినహాయించుకుని మిగిలిన అయిదు రూపాయలు ఇవ్వునాకు. పద్దులో రాసుకో.'

'ఎందుకూ అదొక దండగ'

'థాంక్స్'

బిల్లు తుకారాం ఇస్తుంటే బల్లకి ఒక ప్రక్కగా నున్న టెలిఫోన్ వీర్రాజు దృష్టి నాకర్షించింది.

'మే ఐ యూజ్ ది టెలిఫోన్ ప్లీజ్' అని సవినయంగా అడిగి సమాధానం కోసం చూడకుండానే ఫోనెత్తి 'టూ, త్రీ, సిక్స్ ప్లీజ్' అన్నాడు.

కొంచెం సేపటికి అవతల మనిషి గొంతు వినిపించింది.

'నేను సార్ వీర్రాజుని, బావున్నారా ?'

'......'

'అదేనండి, ఎస్. వీర్రాజుని! వీర్రాజూ అండ్ బ్రదర్స్ తాలూకు మొదటివాడిని.'

'... ...'

'భలేవారే మీరు! నన్నుగుర్తుపట్ట పోవడమేమిటండీ. సిల్లీ!'

... ...

'మీ అబ్బాయా — నేనెరగనండి మీరు తెలియనట్లు మాట్లాడుతుంటే నాకు నవ్వొస్తోంది. రియల్లీ. మా తుకారాం కూడా నవ్వుతున్నాడు.'

'...'

'వాడెవడా ? బాగానే ఉంది! తరువాత 'మీ రెవరు ?' అని కూడా అడిగేస్తారు. మీ సొమ్మేం పోయె.'

'...'

'అడిగేశారూ–శశిరేఖ ఫ్రెండ్‌నండి. మీ ఇంటికి కారులో వస్తూంటాను నేను అంబాసిడర్ కొంటేనేగా మీరు పర్చేజ్ చేసే దాకా శశిమిమ్మల్ని నిద్దరోనీయ లేదు.'

'...'

'మీకు కారు లేదా! మైగాడ్.'

'...'

అమ్మాయి కూడా లేదా, మై ఫుట్ !. నాకుంది లెండి. అమ్మాయికాదు కారు.'

'...'

'మీ పేరు వెంకటేశ్వరరావు గారు కదూ !'

'... ...'

'సారి. రాంగ్ నంబర్. సారీ ఫర్ ది ట్రబుల్.'

ఫోను ఠక్కున పెట్టేశాడు వీర్రాజు. వెంకటేశ్వరరావుగారి కోసం రింగ్ చేస్తే రాంగ్ నంబరు వచ్చింది తుకారాం' పోదాం పద.'

'నీ జీవితమే ఒక రాంగ్ నంబరు. నువ్వొక మిస్ ఫిట్ వి.' అన్నాడు తుకారాం ఒళ్ళు మండి పోయి.

'అవును గానొరేయ్ తుకారాం, అయ్యరుగాడికి ఫోనుండి కూడా మనం ఇన్నాళ్ళు వాడుకోకపోవడంచూశావా ఎంత ట్రాజెడీయో !'

'కొత్తగా పెట్టించాడు వీడు. రెండ పదివీడు నీ సంభాషణ వింటే ఇంకా పెద్ద ట్రాజెడీ అయ్యుండేది. బ్రతికి పోయావు.'

'ఏడిశావులేవోయ్, వాడికున్న చెముడు తెలియదా మనకి. పైగా దూరంగా లాక్కున్నాగా ఫోను.'

అంతలో వీర్రాజుకి ఎదురుగా ఖద్దరులోమునిగి ఉన్న ఒకభారీ మనిషి అగపడ్డాడు 'హలోవ్ గురువుగారూ, నమస్కారమండి. హైదరాబాదు ట్రిప్పు లెక్కువయినట్లున్నాయీమధ్య దర్శనాలు లేవు బొత్తిగా' అన్నాడు ఆయనకి అడ్డంగా పోయి నిలబడి.

'ఆఁ, ఆఁ అవుననుకోండి. తమరిని ...'

'ఎక్కడ చూశారో గుర్తు రావడం లేదంటారు. నాకు తెలుసు సార్. పెద్దలు, మా బోటి చిన్న వాళ్ళం మీకు గుర్తుంటామా? మరిచి పోవాలి. అంతే మరి. అదిరూలు.'

'అన్నన్న ఎంతమాట–చూసినట్లుబాగా గుర్తే కాని...'

'అక్కడికి అదృష్టవంతుణ్ణి, నేనండీ వీర్రాజుని !'.

మొహమాటంగా నసిగాడాయన.

'గుర్తురాలేదా, నాకుతెలుసు. సార్. పోనీ మన తుకారాం గాడయినా గుర్తున్నాడా ? అవును లెండి నేను లేక పోతే వాడెలా ఉంటాడు ? మీరు గొప్పవారు కనుక మీతోటి పరిచయం భద్రంగా మంచి గంధప్పెట్టెలో దాచినట్టు దాచుకుంటాము.'

'మీరలా అనేయకండి. ముఖంబాగా గుర్తు కొచ్చింది.'

'చెప్పేయమంటావురా తుకారాం, అది చెబితే గురువుగారికి తప్పకుండా గుర్తుకొస్తుంది. సరేసార్ చెబుతున్నాను. నిరుడు గుంటూరు సభలో మనం...'

'ఆఁ గుర్తు కొచ్చిందండి. బావున్నారా ?'

'ధన్యుణ్ణి క్షేమంగా ఉన్నాం, ఏమిటి కబుర్లు ?'

'అన్నీ మంచివే. మరినాకు సెలవిప్పిస్తారా. చప్పున గుర్తు రానందుకు మన్నించండి' అంటూనే చకచకా వెళ్ళిపోయాడాయన.

'గుర్తుపట్టడం నీ బాబు తరమటోయ్. అసలు నన్ను చూడందే ఎలా గుర్తుపడతావు! నా ముఖం జ్ఞాపకం వుండటా– వెధవ ముఖం వీడూనూ.'

"నే వెళ్ళిపోతున్నారా వీర్రాజూ, నువ్వు కులాసాగా ఇంటికి చేరుకుంటే రేపు ఆఫీసులో కలుసుకుందాం."

"అగరోరేయ్, అవునుగాని ఎందుకంత హడిలి చచ్చి పోతావు? తలనరికి మొలేస్తారా? ఎక్కడో చూసిన గుర్తు మీద పొరపాటున వాళ్ళని అపామంటాము. అది తప్పా? లేకపోతే కాలం ఎలారా గడవడం. జీవితం చాలాడల్‌గా తెలుపు నలుపు బొమ్మగా వుంటుందిరా. దాన్ని సారవంతం చేసుకోవాలంటే రంగులు పులమాలి చూద్దువుగాని రా తమాషా."

"రాను."

"ఇంత శ్రమ చూసి వెళ్ళిపోవడం నీ ఇష్టమేటోయ్ - ఇంకా అర గంట గడవాలి."

"ఎందుకు?"

"స్టేషన్‌లో రిసీవ్ చేసుకునేందుకు."

"ఎవరిని?"

"గార్డుని, లేకపోతే డ్రైవర్ని. పదరా! ఒక్కసారి మెడికల్ షాపుకి వెడదాం రా."

"నమస్కారం సార్. తెప్పించారా - ఐమోన్ స్టాకొచ్చిందా?"

ఏమిటున్నట్లుగా మొహంపెట్టి అమాంతే అడిగాడు షాపాయన.

"అదేవిటండీ ఇప్పటికి ఎన్నిసార్లు తిరిగాను మీ షాపుచుట్టూ. అదేనండి హార్లిక్స్. ఒక అరడజను కావాలని."

"ఇంకా రాలేదండి."

"పిటీ! ఇంట్లో చెడ్డ ఇబ్బందిగా ఉంది లెండి. నా మిసెస్‌కి బాగా అలవాటు - వాళ్ళ ఫాదర్ నేర్పాడు. "మా ఫాదర్‌కి రాయండి పంపిస్తారు మనిషి నిచ్చి" అంటుంది. మనపరువు ఏం కాను చెప్పండి. ఇంతమంది మన ఫ్రెండ్సుండి ఊళ్ళో!... రాగానే నా మాటమాత్రం మరవకండేం! బైదిబై ఒక్కసారి ఫోను చేయాలండి థాంక్స్," అని ఫోనెత్తి

"వన్ మినిట్ ప్లీజ్ - సాయంత్రం ఎక్స్‌ప్రెస్ ఎన్నింటికో చెప్పగలరా?"

"..."

"స్టేషన్‌కి కనెక్షనిస్తానంటూరా నో, నో నామీద దయుంచి అటువంటి పని చేయకండి. అక్కడెవరూ సమాధానం చెప్పరు. కర్టసీ అన్నది లేదు. ఇప్పుడు మీరున్నారు చూడండి. మీ పని కాకపోయినా విసుక్కోకుండా ఇంత సేపు మాట్లాడారు."

...

"భలేవారే! అది మీ డ్యూటీ అంటే ఒప్పుకోను. మా తుకారాం కూడా ఒప్పుకోవద్దంటున్నాడు. కనెక్షన్ ఇవ్వడంవరకేటు మీ డ్యూటీ. ఎవరూ-తుకారాంహూ- మా ఫ్రెండు లెండి."

"..."

"సిక్స్‌కా ట్రెయిను. థాంక్సండి. దట్సాల్ రైట్" నవ్వుతూ పెట్టేశాడు వీర్రాజు.

బయటకు వస్తూనే 'ఎక్సేంజికి పోదామేమిటిరా తుకారాం?" అన్నాడు.

"ఎందుకుట?"

"ఎంత చక్కగా నవ్విందోయ్ అమ్మాయి. ఫైన్. పైసా ఖర్చు లేకుండా అమ్మడుతో మాట్లాడగలగటం. నిజంగా మార్కోనీకి ఋణపడి ఉన్నాంరా."

"జైల్ కి"

"దానికెందుకు?"

"టెలిఫోను కనుక్కోండి బెల్ లే. అందుకు."

"ఐసీ"

"మరినే వెళ్ళిపోతున్నాను, వీర్రాజు."

"ఆల్ రైట్ ఒక్క నిమిషం ఆగరాదూ, ఆవచ్చే వారితో మాట్లాడదాం క్లోజింగెంత ఉందో..."

ఖంగారుగా వెళ్ళిపోయాడు తుకారాం.

"నో, మన పనేమిటి మిస్టర్ వీర్రాజు, రైలు రాకకి ఇంకా కొద్దిగా టయిము మిగిలింది. ఈలోపల మరో హరిని ఇంటర్వ్యూ చేస్తేపోలా" అనుకునిచుట్టూ చూశాడు. ఎవరూ సరయిన వాడగబడలేదు. సెంటరులో మాత్రం పోలీసు నిలబడి ఉన్నాడు.

చకచక అతని వైపు నడిచి "ఎక్స్‌క్యూజ్ మి, స్టేషనుకి వెళ్ళేదారి చెబుతారా?" అనడిగాడు.

"ఇలా నేరుగా వెళ్ళండి సార్".

"థాంక్యూ. పాపం మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను."

"అదేంలేదు సార్. ఏవూరు సార్ సుంది?"

"మద్రాసునుంచి వచ్చామిందాక. మా వాడు కారులో వెళ్లమంటే వినక నడిచి బయలు దేరాను - ఊరు చూద్దామని."

"అవును సార్, నడిస్తేనే బాగాగుర్తుంటుంది" అన్నాడు నడవడంలో ఆరితేరిన పోలీసుగారు.

ఇవతలికి వచ్చేశాక అనుకున్నాడు "ఇలా నేరుగా స్టేషనుకి పోనివ్వచ్చు బండీని" అని.

ప్లాటుఫారం అంతా కోలాహలంగా ఉంది. జనం నడిచేందుకు సందులేకుండా కూర్చుని ఉన్నారు ప్రయాణీకులు. నకులుడు వానరసేనకుల మధ్య నుంచి గుర్రాన్ని తోలినట్టుగా దూసుకు పోతున్నాడు వీర్రాజు.

కంటికి నదురుగా ఎవరయినా అగపడతారేమో ఈకాసేపు అక్కడే కాలం గడుపుదామని చూసుకుంటూ పోతున్నాడు. హఠాత్తుగా అతని కంటికి నదరుగా, అతను ఠక్కున నడక ఆపేటంత కొట్టొచ్చినట్లు ఒకమ్మాయి అగపడింది.

"సీత లాగుందే!" అనుకున్నాడు వీర్రాజు.

పరికించి చూసి "లాగా ఉండటం ఏమిటి సాక్షాత్తు సీతే" అనుకున్నాడు.

అవిడని గతంలో బాగా ఎరుగున్న వాడడం వలన అప్పటి లక్షణాలు ఇంకా అగపడతా యేమోనని నిదానించి చూశాడు.

పట్టుచీర కట్టుకుంది. పచ్చటి మెడని చుట్టి బంగారపుగొలుసు అగపడుతోంది. చేతిలో వ్యానిటీ బ్యాగ్.

"చాలా బాగుంది సీత" అది అతని ఇదివరకటి అభిప్రాయం.

"ఇదివరకటికన్న ఇంకా బావుంది" అన్నది ఇప్పటి అభిప్రాయం.

సిగరెట్ తీసి, ఎదురుగా వస్తున్నాయన్ని ఆపి, ఆయన చేతిలోని సిగరెట్ చొరవగా తీసుకుని తనది ముట్టించుకున్నాడు. పొగవదిలి మళ్ళీ ఆమెనే చూశాడు. అలా ఆమెను చూస్తుంటే స్కూలులో ఆమె చిలిపిపనులు కొన్ని గుర్తుకొచ్చా యతనికి.

సీతావాళ్ళఇల్లు తనింటికి కొంచెంగా అవతల. వాళ్ళనాన్న ఏదో బ్యాంకులో ఏజంటుగా ఉండేవాడు. ఒక్కతే కూతురు కావడాన చాలా గారాబంగా పెరిగింది. అందుకనే బడికి ఖరీదయిన బట్టల్లో ధళధళ మెరుస్తూ వచ్చేది. తను డబ్బుగల వారమ్మాయినని తెలియపరచాలని ఆ అమ్మాయికి భలే సరదా.

ఒకరోజున తన్నీ, తనతోబాటు మరో పది ఆడ, మగ పిల్లల్ని డ్రింకుషాపుకి తీసుకెళ్ళి ఐస్‌క్రీం పెట్టించింది. తనంతకు ముందెన్నడూ ఐస్‌ఫ్రూట్‌లు తిన్నవాడేగాని అద్దాలమధ్య కూర్చుని 'క్రీం' తిన్నవాడు కాదు. సీత అంటే గౌరవం పెంచేసింది ఆ ఐస్‌క్రీం. అందుకనే సీత తనతో చనువుగా ఉంటుందని మిగిలిన వారికి తెలిసేలా ఆ అమ్మాయికి పక్కగా కూర్చున్నాడు. అక్కడ ఐస్‌క్రీం అయినాక బడికి తిరిగివస్తూ మళ్ళీ అందరికీ ముంతమసాలా కొనిపెట్టింది. అవి చాలవన్నట్లు అతనికిమాత్రం ప్రత్యేకించి మళ్ళీ హోటల్లో టిఫిన్ పెట్టించి "ఇలా పెట్టించానని మాఇంట్లో చెప్పవు కదూ వీర్రాజూ" అంది.

నిజానికి ఆ మాటతో అంతక్రితం ఉన్న సరదా యావత్తూ చచ్చిపోయింది తనలో.

భయపడినట్లుగానే సాయంత్రం వాళ్ళనాన్న కబురంపాడు తన్ని రమ్మనమని. తీరా అక్కడికి వెళ్ళేసరికి నాన్నగారు, సీతావాళ్ళ నాన్నగారూ కూర్చుని ఉన్నారు.

తరువాత పదినిమిషాల్లో తేలిన సారాంశం ఏమంటే వాళ్ళనాన్నగారి జేబులోంచి పది రూపాయలు మాయం చేసిందిట సీత!

"ఆ అమ్మాయి అలా మేపుతూఉంటే ఎలా తిన్నావురా ఫుంఢాకోర్?" అంటూ నాన్నగారు కొట్టారు తన్ని. తనకిప్పటికీ అది బాగా జ్ఞాపకం-నాన్నగారు తన్ను కొట్టిన మూడుసార్లలో అదే మొదటిది కనుక.

"పోన్లెండి. వాడినెందుకు కొడతారు- మాసీతని అనక" అన్నారు వాళ్ళ నాన్నగారు.

కొన్నాళ్ళు సీతతో తను మాట్లాడడం మానేశాడు. మళ్ళీ వాళ్ళనాన్నే పిలిచి చెప్పాడు "తప్పు, అలా మాట్లాడకుండా ఉండకూడదని."

బహుశ సీతే చెప్పి ఉంటుంది, మాట్లాడడంలేదని.

ఎప్పుడూ ఇంటిదగ్గరనుంచి తెచ్చుకున్నవి తనకి పెడుతూండేది. అందుకే "హీరోవర్షిప్" అంటారే అటువంటిది ఏర్పడిపోయింది ఆ అమ్మాయిపట్ల తనకి. ఏ పని చేయమన్నా నిమిషాల మీద దూకేయడమే - అలా చేయించగల చాతుర్యం ఉంది ఆ అమ్మాయి మాటలో, మనిషిలో.

ఒకసారి "చింతచెట్టు ఎక్కి కాయలు కోయలేవు నువ్వు. నీకేమీ పెట్టను పో" అంది.

స్కూలు వెనకభాగంలో రాక్షసుడిలా నిలబడి ఉన్న చింతచెట్టంటే తనకెప్పుడూ భయమే. "దయ్యాలుంటాయి చింతచెట్లమీద" అంటుండేది అమ్మ.

"ప్రభాకర్ నాకు కోసిపెడతానన్నాడు. 'వాడికే పెడతాను.' అయినా అంత భయమేమిటి నీకు. ఆడపిల్లకి, నీకు తేడా ఏమిటి? మా నాన్నకి తెలిస్తే తంతారని భయంకాని లేకపోతేనా నేనే ఎంచక్కా ఎక్కి..."

ఆమె మాటలు పూర్తయేసరికి చెట్టు పైకి, పైపైకి వెళ్ళిపోతున్నాడు తను. తనలో ఆ ధైర్యం, శక్తి ఎలావచ్చాయో తలుచుకుంటే ఇప్పటికీ ఆశ్చర్యంవేస్తుంది. ఎందుకంటే ఇప్పటికీ వంటరిగా ఉన్నప్పుడు చింతచెట్టంటే తనకి భయమే."

జేబుల్లో చింతకాయలు నింపుకుని "సీతా, చాలా-ఇంకాకోసి కిందపడేయమంటావా" అంటూ కిందికి చూశాడు తను.

తను ఆకాశం అంతఎత్తున ఉన్నాడు. కిందుగా ఎక్కడో భూమ్మీద రాక్షసుడిలా బెత్తంపుచ్చుకొని- లెక్కలమాస్టారు నిలబడి ఉన్నాడు.

అంతే తను కళ్ళు తెరిచేసరికి ఇంట్లో మంచంమీద పడుకొని ఉన్నాడు. అమ్మ పక్కనే కూర్చుని ఏడుస్తోంది. తనకి వళ్ళంతా నెప్పులు. కదలనీయడంలా కట్లు.

తరువాత తెలిసిన విషయం - సీత వెళ్ళి మాస్టారుని పిలుచుకు వచ్చిందని. బెదిరిద్దామని ఆయన వచ్చారనీను.

వీటన్నిటికన్న భయంకరమయిన విషయం ఒకటి జరిగింది బడిలోనే. దీపావళి ముందురోజులవి. ఇస్మాయిల్ గాడు సైన్సుమాస్టారు వచ్చేముందు మాస్టారి కుర్చీ నాలుగుకోళ్ళకింద కప్పగంతులు పెట్టాడు. ఆయనకి కుర్చీ లాక్కుని కూర్చోవడం పెద్ద అలవాటు.

లాగగానే కప్పగంతులు అంటుకుని పేలడం మొదలెట్టాయి. పాపం మానవుడు ఖంగారుపడి తరువాత కోలుకుని, కోపం తెచ్చుకుని "ఎవడురా రాస్కెల్, ఈ పని చేసింది" అంటూ తాండవం ఆడిపోయాడు.

అందరికి తెలుసు ఎవరు చేసిందీను. కాని ఇస్మాయిల్ అంటే భయం: వాడు పెద్ద రౌడీ. అందుకని ఎవ్వరూ మాట్లాడలేదు.

అనేలే ఆయన ముక్కోపి. బెత్తం తీసుకుని అందరినీ చేతులు చాపించి తలొకదెబ్బ కొట్టడం మొదలుపెట్టాడు. అందరిని ఉడ్చిఉడ్చి కొట్టినవాడు సీతని, తరువాత మిగిలిన ఆడపిల్లల్ని మెల్లిగా కొట్టి మళ్ళీ కుర్చీదగ్గరకు వెళ్ళి "వస్తే శామరా ఈ వెధవపని చేసినవాడిని, అరేయ్ ఇస్మాయిల్" అని అరిచాడు బిగ్గరగా.

అంతే. ఇస్మాయిల్ గాడు పత్తా లేకుండా పారిపోయాడు.

అప్పటినుంచి అదొక పెద్ద మిస్టరీ అయిపోయింది అందరికీనూ. "దెబ్బలు కొట్టేంతలో ఎలా డిటెక్షన్ చేశాడూ" అని.

"ఎల్లాగో చెప్పనా – నేను అరచేతిలో ఇస్మాయిల్ పేరురాసి చేయి చాపాను. అందుకే నన్ను, తరువాత రమ, సుశీల వాళ్ళనందరినీ మెల్లిగా కొట్టారు" అని చెప్పింది సీత – ఇదిజరిగిన చాలాకాలానికి ఒకరోజు తనతో.

అప్పట్లోనే ఆమె తెలివికి జోహారు అర్పించాడు తను.

"అటువంటి అల్లరిపనులు చేసేది సీత. ఇప్పుడయినా మారిందో లేదో" అనుమానం వచ్చింది వీర్రాజుకి.

గబగబ వెళ్ళి ఆమెముందు రెండు సార్లు అటుఇటు తిరిగాడు. చూసినట్లు లేదని కొంచెంగా దగ్గి ఆమె వంక చూశాడు.

అతనివంక చూసింది. మళ్ళీచూసింది, మళ్ళీమళ్ళీ చూసి చిన్నగా నవ్వి "మీరు వీర్రాజు కదూ" అంది.

తను చొరవతీసుకుని పలకరించనందుకు సిగ్గుపడ్డాడు వీర్రాజు.

"అవును మీరు సీతేనా ?"

"కాకపోతే నిన్ను గుర్తుపట్టి పలకరించే బడిపిల్ల ఎవరు" అంటూ పకపక నవ్వేసింది.

అతనూ నవ్వేశాడు.

"అమ్మా, నాన్నగారూ కులాసా ? ఎక్కడుంటున్నారు వాళ్ళు ?" అడిగింది సీత.

"నాన్నగారు రిటైరయ్యారు వ్యవసాయం చేయిస్తున్నారు. నేనిక్కడ ... లో పని చేస్తున్నాను."

"మరి నా విషయాలు అడగవేం ?"

"అవునవును" అన్నాడేగాని ఆడదాన్ని "పెళ్ళయిందా, ఏం చేస్తున్నావిప్పుడు" అనిఅడగడం అసందర్భం.

ఫక్కున నవ్వేసింది. "నువ్వు కొంచెమైనా మారలేదు. పెళ్ళయిందా ?"

"ఓ. పండగలకి పుట్టింటికి వెళ్ళిందీ రోజు వస్తానంది."

మళ్ళీ నవ్వేసింది. "ఇప్పుడు పండగ ఏమిటి – వినాయకచవితి రాందే."

"ఆ నాముఖం. పండగలంది. నోములుకాబోలు."

"చింతచెట్లంటే భయంపోయిందా. చిటంటేనో ?"

అతనిలోని మగతనం దెబ్బతింది. "అప్పరాల్ తను చిన్నప్పుడుభయస్తుడుగా ఉండచ్చు. అంతమాత్రాన ఇంతతేలికగా మాట్లాడుతుందా ? తుకారాం నడిగితే చెబుతాడు, రోడ్డుమీద తన లీలలు. వెధవ, వచ్చినా పోయేది తనవెంట" "నన్నిగురించి చెప్పేందుకు మరెవరూ లేనప్పుడు మనమే ఆ పనికి పూనుకోవాలి" అని పెద్దవాడు కావాలనుకుంటున్న ఒకాయన అన్నమాటలు గుర్తుకొచ్చాయి వీర్రాజుకి.

"హు భయం. నన్ను చూసి నువ్వు భయపడాలిప్పుడు. రోడ్డుమీద వాళ్ళనందరిని ఒక్క ఆట ఆడించి వచ్చానిన్నదే."

డ్రిల్లు మాస్టారిలా అదేంపని ? ఆదేమిటో వివరంగా చెప్పాడు వీర్రాజు. తను ఆరోజు ఆఫీసునుంచి బయలుదేరినప్పటినుంచి చేసినపనులన్నీ చెప్పి "మనం ఖరీదయిన బట్టలువేయాలి. ఇంగ్లీషువాళ్ళ పుణ్యమా అని నేర్చుకున్న నాలుగు మాటలు ఉంగరంలో రాళ్ళలా వాడాలి. అవతలివాడు పడిపోక ఏం చేస్తాడు ?" అన్నాడు.

నవ్వింది సీత. "కనుక ఇదొకహాబీ అన్నమాట నీకు."

"వ్రతాలకి ఫలితం ఉన్నట్టుగా దీని వలన ఉపస్థితార్థాలు తీరవుగాని సరదాగా పొద్దుపోతుంది."

టైము చూసింది సీత. "ఇంకా బండి రావటానికి ఆలస్యం ఉంది – ఈరోజు లేటులే. అలా కాన్‌టీన్‌కి పోదాం రా" అంటూ నడిచింది.

సీతలాంటి అందమయిన అమ్మాయి పక్కన నడవగలుగుతున్నందుకు గర్వపడుతూ ఆమెను అనుసరించాడు వీర్రాజు. తన గొప్ప ఆమెకు చెప్పేయడంతో అతన్ని ధైర్యం ఆవహించింది.

అందుకనే కాఫీలు తాగుతూ "ఎక్స్‌క్యూజ్ మి, ఇప్పుడు నువ్వు ఎక్కడుంటున్నట్లు – ఐమీన్ మీవారు ఏంచేస్తున్నట్టు ?" అన్నాడు.

తాగుతున్న కాఫీ కిందపెట్టి దాని వంకనే చూస్తుండిపోయింది సీత.

"సారి, నీకేమయినా ఇబ్బంది కలిగిస్తే ..."

"నా టెటాల్. అడిగినందువలన కొత్తగా వచ్చే బాధేముంది. నిజానికి చిన్ననాటి స్నేహితులం – నీకు చెప్పుకోవడం పెద్ద రిలీఫ్‌కూడా."

వీర్రాజుకి ఆ అమ్మాయిని చూస్తే జాలేసింది. ఇప్పటివరకు సరదాగా ఉన్న దాన్ని హఠాత్తుగా బాధపెట్టానేమా అనిపించింది.

"చిన్నతనం నుంచి నేనెంత గారాబంగా పెరిగానో తెలుసుగా నీకు వీర్రాజూ. చివరికి నేను డబ్బు తీసినందున నీకు మీ ఫాదర్‌ద్వారా దెబ్బలు తగిలాయిగాని నాన్నగారు నన్నే మీ అనలేదు. చాలా అపురూపంగా చూసుకునేవారు నన్నాయన. నా మాటకి తిరుగు లేకుండా నా చేతికి అడ్డులేకుండా పెరిగాను.

అందుకే జీవితమంతా ఆ విధంగా ఉంటే బావుండునని, పెళ్ళి అంటూ లేకుండా నాన్నగారి దగ్గరనే ఉంటుంటే బావుండునని అనిపించేది నాకెప్పుడూ

పెళ్ళయితే రాబోయేవారు ఎటువంటి వాళ్ళౌతారోనని భయమూ ఉండేది.

భయపడినంతా జరిగింది.

ఏ పిల్లనయినా "పెళ్ళిచేసుకోమ్మా అంటే సిగ్గుకొద్దీ వద్దంటుంది" మా నమ్మకం. అది కొంత నిజంకూడా. నాన్నగారు అందుకే ఆ ఒక్కవిషయంలో మాత్రం నా మాటని లక్ష్యపెట్టలేదు. పెళ్ళిచేశారు నాకు.

ఆయన ఎమ్మెస్సీ ప్యాసయి రిసెర్చి చేస్తున్నారు. మనిషి చాలా బావుంటారు. అయన్ని చూసి మురిసిపోయాను. కాని వాళ్ళ ఇంటికి వెళ్ళాక తెలిసింది ఆయనకి తల్లిమాట వేదమని, అవిడ మాట జవదాటరనీను. అయితే ఆవిడ సలహాలు, మాటలు మంచివయితే అందులో ఇబ్బంది ఉండేదికాదు.

ఆవిడ నిప్పుకూడా కడిగే వీర మడి గలది. భావాలుకూడా దానికి తగినట్లుగానే ఉంటాయి. భార్యతో భర్త పగటి పూట మాట్లాడరాదు. కనీసం కన్నెత్తి చూడకూడదు. ఇద్దరూ బద్ధవైరం ఉన్న వారిలా ప్రవర్తించుకోవాలి. సినిమాలు, షాపింగ్ వంటివి నిషేధం అని వేరే చెప్పనవసరంలేదు.

మధ్యాహ్నం ఒంటిగంటకి పూజలు, పురస్కారాలు అయినాక భోజనాలు. మళ్ళీ రాత్రి పదిగంటలదాకా ఆకలితో మాడిపోయేదాన్ని.

అయన్ని మార్చేందుకు ప్రయత్నించితే "అమ్మ పెద్దదయిపోయింది. ఈ నాలుగురోజులూ అవిడమాటని కాదనకుండా ఉంటే మనకి నష్టం ఏముంది? ఆవిడ మనస్సుని కష్టపెట్టలేదన్న తృప్తి కూడా ఉంటుంది గా" అనేవారు.

"సరే ఉద్యోగం వచ్చేదాకానేకదా ఈ బాధలు, తరువాత మరొక ఊళ్ళో సుఖపడకపోతానా" అని సరిపెట్టుకున్నాను. ఆ సుముహూర్తంకూడా త్వరలోనే వచ్చింది.

అయితే అక్కడనే కథ మళ్ళీ అనుకోని మలుపు తిరిగింది. పూర్వపు జీవితమే మేలనిపించేటంత దారుణం జరిగింది.

హఠాత్తుగా ఆయన స్నేహితురాలు ఒకతె వచ్చి దిగింది. పేరు జానకి. ఆనాటినుంచి ఆయనలో భయంకరమయిన మార్పు వచ్చేసింది. నన్ను, ఇంటిని మర్చిపోయారు. అవిడే లోకం.

ఆ జానకి, ఈయనా లోగడ బ్రహ్మాండంగా ప్రేమించుకున్నారుట. పెళ్ళి చేసుకుందామనుకుంటే "అమ్మమాట" అడ్డం పడింది. విడిపోయారిద్దరూ.

నాపట్ల నిరాదరణ భరించలేకపోయాను. నిలదీసి అడిగా నొకరోజు. "ఎందుకు నన్ను చేసుకున్నట్లు" అని.

"నిజమే. తప్పే! ఏంచేద్దాంఇప్పుడు?" అన్నా రాయన ఏమీ పట్టనట్లు.

ఏడుపు, ఉక్రోషం వచ్చేశాయి నాకు.

"మా ఇంటికి పోతాను."

"మంచిపనే. నీకెంత డబ్బు కావాలన్నా పంపుతాను."

గుండె పగిలిపోయింది.

నాన్నగారి దగ్గరకు వచ్చేశాను. నేనిక వాళ్ళ ఇంటికి వెళ్ళనని చెప్పేశాను. అల్లుడితో మాట్లాడి వచ్చారాయన. "మీ అమ్మాయికి ప్రతినెలా ఎంతకావాలో చెప్పండి – తప్పకుండా పంపిస్తాను" అన్నారుట కొట్టొచ్చినట్లు.

"అదీ నాపరిస్థితి. మళ్ళీ చదువుకుందామని ఉంది. కాని ఇంకెవరికోసం" ఆమె కంఠం బొంగురుపోయింది. కళ్ళు నీళ్ళతో నిండాయి.

చూడలేకపోయాడు వీర్రాజు. ఆ అమ్మాయిపట్ల సానుభూతితో నిండిపోయింది అతని మనసంతా.

"ఎంతగారాబంగా పెరిగింది. పాపం వాళ్ళనాన్నగారు ఈవిడమీద ఎన్ని కలలు కట్టుకున్నారో. అవన్నీ ఇప్పుడు తలుచుకుంటే ఆయనకి గుండె చెరువయిపోదూ! ... బంగారపు బొమ్మలాంటి మనిషి. ఆ భర్త ఎంతటి రాక్షసుడు."

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగింది సీత.

"నిన్ను గురించే."

కేవలంగా నవ్వేసింది సీత. "పద ట్రెయినువస్తున్నట్లుంది. మా బంధువొకరు వస్తారిందులో."

మళ్ళీ ప్లాటుఫాం మీదికి వచ్చారిద్దరూ.

"గేటులో నిలబడి ఉండు. తరువాత మీ ఆవిడ్ని చూడాలి."

"ఎవర్ని?"

"నీ భార్యనయ్యా బాబూ."

"అలాగే" అంటూ జనంలో కలిసిపోయాడు. ప్లాటుఫాంకి ఒక చివరగా పోయి నిలబడ్డాడు.

కోలాహలంమధ్య రైలువచ్చి ఆగింది. చివరగా ఉండడంవలన చివరగానే ఉన్న పెట్టెలో ఉన్న మోహనమూర్తిని వెంటనే చూశాడు వీర్రాజు.

దగ్గరకు వెళ్ళి "గంటయిందిరా నీకోసంవచ్చి. ఈ అరమైలు పొడవు రైలు చూసేసరికి ఇంకో గంటకిగాని నిన్ను కలుసుకోలే ననుకున్నాను" అన్నాడు.

"సోది తరువాత చెబుదువుగాని ముందు సూట్ కేసు అందుకో" అని కిటికీలోంచి అందించి తను దిగివచ్చాడు. చుట్టూ కలయచూశాడు.

"భలే రష్ గా ఉంది కదీరోజు. అన్నట్లొరేయ్, మనతో చదువుకుందే సీత – బ్యాంకుఏజంటుగారమ్మాయి–గుర్తుందా?"

"సర్లే వచ్చిందా, ఎక్కడుంది?"

"వచ్చిందిగా నొరేయ్, మొగుడు వదిలేశాడుట. భలే జాలేసిందిలే పాపం."

"మొగుడు వదిలేశాడా?"

"అవును గురూ?"

"ఎవర్ని గురించి మాట్లాడుతున్నావు?"

"అదుగో వస్తోంది అటు చూడు."

మోహనమూర్తిని చూస్తూనే చకచకా అతని దగ్గరకొచ్చింది సీత.

"ఏం సీతా, నిన్ను నేను వదిలేశానా?" నవ్వుతు అడిగాడు మూర్తి.

ఫకాలున నవ్వింది సీత.

తెల్లబోయాడు వీర్రాజు.

"మీ అవిడ్ని చూపించరూ?"

"వీడికితోడు పెళ్ళికూడానా! ఇంతకీ సంగతేమిట్రా?"

"ఏముందీ, రోడ్డుమీదవాళ్ళని పలకరించి బంగారు పెట్టడం ఈయనకి సరదాటు. అందుకని నేనూ ఒక కథ చెప్పాను."

"ఒరేయ్ వీర్రాజూ, వచ్చినమాట ఎటూ వచ్చేసిందిగాని నీతోపాటు సాకూ ఒకపిల్లని చూడు – దీన్ని పుట్టింటికి తోలేస్తాను" అన్నాడు మూర్తి.

నవ్వుకుంటూ ముగ్గురూ బయటికి నడిచారు.

□□□